# గొడుగు

మూలనున్న గొడుగందుకొని గుమ్మంలోకి వచ్చి నిలబడ్డాడు రవణయ్య. చిన్నగా చినుకులు పడుతున్నాయి. సూర్యుడు ఇంద్రధనుస్సు ఎక్కుపెట్టి ఒకేసారి వారుణాస్త్రం, ఆగ్నేయాస్త్రం ప్రయోగించినట్టుగా ఒక ప్రక్క చినుకులు పడుతుండగా, మరోవంక చురుక్కుమంటూ వేడి కిరణాలు గుచ్చుకుంటున్నాయి. చినుకులు పడినా పడకపోయినా ఆ గొడుగు వేసుకుంటే గాని రవణయ్య రోడ్డుమీద నడవడు ఒక్క సాయంత్రాలు తప్ప. అంచేత ఎండకెండి వానకి తడవడంవల్ల కాబోలు నల్లని గొడుగు గుడ్డ రంగు విరిగి బూడిదరంగులోకి మారింది.

బయల్దేరినపని జ్ఞాపకంవచ్చి గొడుగు విప్పి బయల్దేరేడు... "ఒసేయ్ అమ్మడూ తలుపేసుకో" అని కేకేస్తూ.

మీదినుంచి సన్నని తుంపర చల్లచల్లగా పడుతూంటే తలెత్తి చూసేడు రవణయ్య. మబ్బులు కమ్మిన ఆకాశంలా కొంతమేర మిలమిలా మెరుస్తున్న చుక్కల్తో నీలాకాశంలా పురుగులు కొట్టేసిన కన్నాలు మెరుస్తూ కనిపించేయి.

'పట్టపగలు చుక్కల్దూరుతయ్యి నా గొడుగులోకి...' అనుకొని నవ్వుకోబోయిన నవ్వుకి 'నువ్వేం తక్కువ్వాడివా... నీ గొడుగేం తక్కువ తిన్నదా...' రమణా బియ్యే గాడి గొంతు లోపలి నుండి పలికి నవ్వు ఉండచుట్టేసింది.

రమణాబియ్యేగాణ్ణి తనే చంపేసాడు. లేపోతే ఇలానే మాటిమాటికి బతుకుదారి కడ్డొచ్చి అల్లరిపెడుతుంటాడు. ఎన్నిసార్లు చంపేసినా అడుగడుక్కీ బతికొచ్చేసి కామెంటు చేస్తూనే ఉంటాడు_'బియ్యే వెనకాల తగిలించుకొని కాణీ సంపాదనలేదుగాని... ఫోజుమాత్రం మాలావు' అంటూ.

"నాగేశ్వర్రావుగారూ..." అంటూ పై నుండి పిలిచేడు రవణయ్య.

"ఏవిట్రోయ్ గారూ గేరూ అంటూన్నావ్, ఇదెప్పటి నుండి... రారా" అంటూ చాపపరిచి కూర్చోమన్నట్టు చాపమీద కొట్టేడు.

"శ్రీరామా ఆపద్బాంధవా.. అనాధరక్షకా"... అంటూ కూలబడి "అయ్యా కాలం మారింది. తాహతులు మారేయి... చూడూ... ఎవరి లిమిట్సులో వాళ్ళుండొద్దూ."

"ఎన్ని నేర్చేవురా... నిజమే, నేర్వవా... నీ జీవితవే నేర్పేసింది... నీ బియ్యే అయ్యి పదేనిరవై ఏళ్ళయుంటాది కామాల... ఉద్యోగవంటూ కాళ్ళరిగేలా తిరిగేవు. అదేదో సెల్ఫ్ ఎంప్లాయిమెంటు స్కీములాగా ఇప్పుడే బాగుంది నీకు నాలుగు ప్రైవేట్లు చెప్పుకుని బతికేస్తున్నావు."

"ఏం బతుకులెద్దూ... నీదగ్గర నీమాట చెప్పాలి... వాడి దగ్గర వాడి మాట చెప్పాలి... ఏ ఎండకా గొడుగు పట్టాలి. ఇన్ని చేసినా చూడు ఇప్పుడింట్లో అన్నీ నిండుకున్నాయి. ఏదో నువ్వు ప్రైవేటు జీతం ఇప్పిస్తావని..." నసిగేడు రవణయ్య.

"రవణయ్యా, జీతవడిగేవని కాదుగానీ... మా వాడు మరీ మొద్దు రాచిప్పయిపోతున్నాడ్రా... ఆ బళ్ళో ఏం చెప్తున్నారోగానీ, పైగా నీ దగ్గర ప్రైవేటు కూడాను."

"మీరన్నారని కాదుగాని నాగేశ్వర్రావు గార్హూ... జీతవడిగేవరకూ పిల్లల బాగోగులు మనకి జ్ఞాపకంరాని దీనస్థితిలో ఉన్నావండీ.... ఆ బాగోగులు కూడా డబ్బుతో లంకె పెడుతున్నాం." ఆ అన్నది మెల్లిగానే అయినా ఆవేదనంతా గడ్డకట్టి చెప్పినట్లుగా ఉంది.

"ఏంరోయ్... ఏవిటో తిడతన్నట్టుగున్నావ్... నిన్నన్లేదు, ఆ బళ్ళో మేష్టర్లనంటూన్నా."

"అవును. నేనూ అదే అంటున్నా. విద్యావిధానంలో లోపాలన్నిటికీ ఉపాధ్యాయుడికే నిందలూ, తిట్లూ... అతడు ప్రత్యక్ష దైవం కాబట్టి! దానిక్కారణం అతనికి ఆర్థికంగా గానీ, సాంఘికంగానీ ఒక స్థాయి లేదు. ఆ స్థితికి దిగజార్చింది మనం. ఉద్యోగాల్లేక ఎక్కడపడితే అక్కడ గోనెపట్టాలేసుకుని

నాలుగు ప్రైవేట్లు చెప్పుకునే మాలాంటి మెథడంటే ఏవిటో తెలియని వాళ్ళోప్రక్క, అసలీ బళ్ళెందుకున్నాయో తెలియని మేనేజిమెంట్లు ఓ ప్రక్క, మంచిని ఇంప్లిమెంటు చేయడానికన్ని గోతులున్నాయని తెలిసికూడా మేస్టర్ల మీద వత్తిడితెచ్చే డిపార్టుమెంటు మరో ప్రక్క, తమ పిల్లల పాస్ గురించి ఆలోచించినంతగా వాళ్ళ చదువు సాముల గురించి అయిదు నిమిషాలు కూడా ఆలోచించడానికిష్టపడని పేరెంట్స్ ఇంకోపక్క ఉపాధ్యాయుల జీవితాల్ని కుక్కలు చించిన విస్తరిని చేసారు. అంచేతనే... ఈ భావిభారత పౌరుడు నక్సలైటవ్వనీ, ఏ విద్యాలయం ఎలా నాశనమైపోనీ, దేశం ఎంత అధోగతి పాలవ్వనీ నిరాశచెందిపోయి ఏ ఎండకాగొడుగు పట్టడం నేర్చుకున్నాడు ఉపాధ్యాయుడు."

'అబ్బో... ఉపన్యాసం చాలా బాగుంది. వన్స్‌మోర్....' అంటూ కేకేస్తున్న రమణాబియ్యేగాడి గొంతు విన్పించేసరికి ఆవేశం కరిగిపోయింది. ఇంట్లోకి తొంగిచూసి నాగేశ్వరరావు కొడుక్కోసం కేక పెట్టాడు రమణయ్య.

మంచినీళ్ళు తాగి గ్లాసు కిందపెడుతూ - "ఆ గుర్నాధం కొడుకు కాన్వెంటు చదువు వెలిగిస్తున్నాడు కదా. ఏదో ఊడపొడిచేస్తాడని అందులో చేర్పించేసేరు. నాలుగింగ్లీషు ముక్కలు రాగానేసరా... డబ్బుతో పని. ఇతగాడు చూస్తే బెల్లపు వినాయకుడికి ముడ్డిగిల్లి నైవేద్యం పెట్టేరకం." అన్నాడు నాగేశ్వరరావు ముఖకవళికలు కనిపెడుతూ.

"హహ" అని బులుపుతీరా నవ్వి "ఏవంటాడేవిటి?" అన్నాడు నాగేశ్వరరావు.

"ఏంమనిషో ఏవిటో, ఎందుకూ ఉన్నాయి లక్షలు. స్టేట్ బ్యాంకీలోనూ ఉన్నాయి కట్టలు. మనకేవిటుపయోగం? ఈవి ఉండాలండీ. దానికి మీతో సరితూగుతాడేవిటి గుర్నాధం. ముఖస్తుతి అనికాదు గాని ఎప్పుడు నాకు తక్కువ చేశారు మీరు? ఆ ప్రైవేటు జీతానికి ఓసారివెళ్తే మా ఆవిడ దగ్గర తాళాలుండి పోయేయంటాడు. మరో సారివెళ్తే చిల్లరలేదంటాడు. రెండూ ఉంటే సుక్కురారం ఇవ్వరాదంటాడు. అదేం మనిషండి మహాప్రభో..."

"బాగా చెప్పావు. గుర్నాధం సంగతి నువ్వే చెప్పాలి రవణయ్యా..." అని

నవ్వి, "ఓరే ప్రసాదూ... అమ్మనడిగి ఓ పదిరూపాయలట్రా..." అని కేకేసాడు నాగేశ్వరరావు.

పుచ్చుకుని, "మరినేవెళ్ళొస్తా బాబూ.... ప్రసాదం బాబూ! రేపు మజ్జినాళొస్తాను ప్రయివేటుకి...ఆ..." అంటూ గొడుగుతీసేడు రవణయ్య.

వీధిలోకి వచ్చి అలవాటుగా ఆకాశం ప్రక్క చూసేడు రవణయ్య. ఎక్కడా మబ్బుతునక కూడా కన్పించకుండా ప్లేటు పిరాయించేసింది ఆకాశం. నెల్లతరబడి జీతాల్లేక ఆకల్తో ఉన్న ఉపాధ్యాయుళ్ళా కిరణాలబెత్తాల్తో కసితీరా జనాల నెత్తిమీద కొడుతున్నాడు సూర్యుడు. ఎదురు దెబ్బలతో లోకజ్ఞానంతో, వికసించిన మేస్టారి తెలివితేటల్లో రవణయ్య గొడుగు విచ్చుకుంది.

*(నిర్మల మాసపత్రిక, జూలై 1974)*